ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం అక్టోబరు 17, 2024

పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు కృషిచేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశించారు. సమగ్ర శిశు అభివృద్ధి, బాలల సంరక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్ తదితర విభాగాల అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులల్లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. కేంద్రాల్లో ఆకు కూరలతోపాటు మునగ, కరివేపాకు, ఉసిరి, చింత, వెలగ తదితర మొక్కలను పెంచాలన్నారు. వీటిని అందజేస్తే విటమిన్లు, కాల్షియం లోపాలను అధిగమించవచ్చునని వివరించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సొంత భవనాల్లేని చోట త్వరలో స్థలం కేటాయిస్తామన్నారు. బాలకార్మికుల నిర్మూలనకు సూచనలిచ్చారు. జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా సంక్షేమాధికారిగా లెనీనా బాధ్యతల స్వీకరణ




కొత్తగూడెం కలెక్టరేట్: జిల్లా సంక్షేమాధికారిగా జె. స్వర్ణలత లెనీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ములుగు జిల్లా అధికారిగా పనిచేస్తున్న ఆమెకు సహాయ సంచాలకులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు ఆ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు వెలువరించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో లెనీనా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

జలజలా.. ఉబికివచ్చెనిలా!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వ్యవసాయమే వెన్నెముక. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్న చందంగా.. వ్యవసాయ రంగం బాగుండాలంటే సమృద్ధిగా వర్షాలు కురవాలి. ఈ ఏడాది భద్రాద్రి జిల్లాను వర్షాలు ముంచెత్తాయి. పలుచోట్ల భూగర్భజలాలు పైకి ఉబికాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి భూగర్భ జలమట్టం సగటున 0.78 మీటర్లు పెరిగింది. సెప్టెంబరు నెలకు సంబంధించిన భూగర్భ జలమట్టం వివరాలను అక్టోబరులో విడుదల చేస్తారు. ఫీజో మీటర్ల సాయంతో ఈ వివరాలు ప్రతినెలా సేకరిస్తారు. సెప్టెంబర్-2023తో పోలిస్తే సెప్టెంబర్-24లో 0.55 మీటర్ల అధికంగా భూగర్భ జలాలు పెరిగినట్లు ఆ శాఖ అధికారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే



మండలం	సెప్టెంబర్ 2023	సెప్టెంబర్ 2024	వ్యత్యాసం (మీటర్లలో)
ఆళ్లపల్లి	5.21	3.93	1.28
అన్నపురెడ్డిపల్లి	12.74	12.50	0.24
అశ్వాపురం	2.28	3.34	-1.06
అశ్వారావుపేట	12.13	10.40	1.73
భద్రాచలం	2.82	1.16	1.66
బూర్గంపాడు	4.31	3.36	0.95
చంద్రుగొండ	6.99	6.60	0.39
చర్ల	1.27	1.31	-0.04
చుంచుపల్లి	3.58	2.46	1.12
దమ్మపేట	17.97	15.71	2.26
దుమ్ముగూడెం	1.05	1.15	-0.10
గుండాల	3.06	2.33	0.73
జూలూరుపాడు	5.75	4.29	1.46
కరకగూడెం	1.40	1.25	0.15
కొత్తగూడెం	26.71	29.00	-2.29
లక్ష్మీదేవిపల్లి	4.11	2.18	1.93
మణుగూరు	1.10	0.95	0.15
ములకలపల్లి	4.56	3.88	0.68
పాల్వంచ	7.28	6.40	0.88
పినపాక	6.50	5.83	0.67
సుజాతనగర్	3.34	3.75	-0.41
టేకులపల్లి	5.38	4.17	1.21
ఇల్లెందు	2.33	1.88	0.45

క్రీడల నిర్వహణ సన్నాహక సమావేశం

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలను కిన్నెరసాని క్రీడా పాఠశాలలో శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశాలతో క్రీడా ఏర్పాట్లపై సన్నాహక సమావేశాన్ని కిన్నెరసానిలో గిరిజన క్రీడల అధికారి బి.గోపాలరావు అధ్యక్షతన బుధవారం జరిపారు. గోపాలరావు మాట్లాడుతూ జిల్లాలోని ఏడు డివిజన్లకు చెందిన క్రీడాకారులు తొమ్మిది క్రీడాంశాల్లో పోటీ పడతారని చెప్పారు. నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

19న దిశ కమిటీ సమావేశం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'దిశ' కమిటీ సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ బుధవారం తెలిపారు. మహబూబాబాద్ ఎంపీ, 'దిశ' కమిటీ ఛైర్మన్ పోరిక బలరాంనాయక్ అధ్యక్షతన జరిగే సమావేశానికి కో-ఛైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

మరింత మెరుగుబడి!

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రాథమిక విద్య బలోపేతం కానుంది. ఏళ్లుగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సర్దుబాటు ప్రక్రియ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల (సీఆర్పీ)లతో చదువులు అరకొరగా సాగుతున్నాయి. తాజా డీఎస్సీ ద్వారా ఏకోపాధ్యాయ పాఠశాలలతోపాటు మూతపడిన బడులు పూర్వవైభవం సంతరించుకోనున్నాయి. ఇన్నాళ్లు ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో వృద్ధి చెందటం లేదని వివిధ అధ్యయనాలు స్పష్టం చేసిన విషయం విదితమే. దీనికి తోడు ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులతో సమస్య మరింత జటిలంగా మారింది. ఈ ఏడాదే ఉద్యోగోన్నతుల అవకాశం కల్పించటంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోధనకు వెళ్లారు. మరికొందరు బదిలీ అయ్యారు. ఇలాంటి తరుణంలో డీఎస్సీ-2024తో సర్కారు ప్రాథమిక విద్యకు మహర్దశ కలిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం పోస్టింగ్ తీసుకొని బోధనను బుధవారం ఆరంభించారు. ఈనేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.


పినపాక మండలం కొత్తగుంపు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న నూతన ఉపాధ్యాయురాలు

ప్రాథమిక పాఠశాలలు..	
ఖమ్మం:	813
భద్రాద్రి:	778

◆ ఏకోపాధ్యాయ బడుల్లో నూతన గురువులు జత కలవటంతో తొలిరోజు ఆయా పాఠశాలలు కళకళలాడాయి. భద్రాద్రి జిల్లాలో 167 పాఠశాలల నుంచి బదిలీ అయిన 196 మంది ఉపాధ్యాయులు రిలీవ్ కావాలి.

జిల్లాల వారీగా..

దసరా అనంతరం పండగ వాతావరణంలో పాఠశాలల్లో బోధన ప్రక్రియ పునఃప్రారంభమైంది. ఖమ్మం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) 334 పోస్టులకు 317 మంది నియామక పత్రాలు అందుకొని పాఠాలు బోధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు 185 ఉన్నాయి. కొత్త ఉపాధ్యాయుల రాకతో 2024 జూన్‌లో బదిలీ అయ్యి వేచిచూస్తున్న 229 మంది ఉపాధ్యాయులు రిలీవ్ అవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 268 పోస్టులకు 258 మంది ఎస్జీటీలు పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 234 ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ సత్వర నిర్ణయంతో ప్రాథమిక విద్య బలోపేతమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు అవకాశం లభించింది. మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయి. తాజా డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ ద్వారా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరింది.
- ముమ్మడి వెంకటేశ్వరాచారి, డీఈఓ

హామీల అమలుకు ప్రాధాన్యం: మంత్రి పొంగులేటి



కూసుమంచి, నేలకొండపల్లి, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, గౌడలకు కాటమయ్య కిట్లను నేలకొండపల్లిలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో సరిగ్గా పది నెలల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం.. రాష్ట్ర ప్రగతికి, ప్రజా సంక్షేమానికి పాటుపడుతోందని చెప్పారు. గీత కార్మికులు, మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, ఖమ్మం ఆర్డీఓ గణేష్, ఆబ్కారీశాఖ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, సహాయ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ పాల్గొన్నారు.

మూడున్నరేళ్లయినా.. ముందడుగేదీ..?

ఈటీవీ, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం మామిళ్లగూడెం

ఖమ్మం నగరంలో ఐటీ హబ్-1 సత్ఫలితాలిస్తుండటంతో మరికొంతమందికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో చేపట్టిన ఐటీ హబ్-2 నిర్మాణ పనులు అతీగతీ లేకుండా పోతున్నాయి. రూ.36 కోట్ల అంచనా వ్యయంతో ఐటీ హబ్-2 నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదిలోపే దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించింది. గుత్తేదారుల అలసత్వం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఐటీ హబ్-2 పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారయ్యాయి.

కొరవడిన పర్యవేక్షణ

సాంకేతిక విద్యనభ్యసించిన వారికి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రాల్లో ఐటీ హబ్‌ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఖమ్మం నగరంలో సకల హంగులతో ఐటీ హబ్-1 నిర్మించింది. 14 ఐటీ కంపెనీలు కొలువుదీరటంతో వందలాది మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి. మరికొందరికి ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో 2021లో అప్పటి ప్రభుత్వం ఖమ్మం నగరానికి ఐటీ హబ్-2ను మంజూరు చేసింది. 2021 ఏప్రిల్ 2న పనులు ప్రారంభించింది. 2022 ఏప్రిల్ నాటికి ఐటీ హబ్-2ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించుకుంది. మూడున్నరేళ్లు దాటినా పిల్లర్ల దశలోనే పనులు ఉన్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో తెలంగాణ పారిశ్రామిక, మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) అధికారులు ఉన్నప్పటికీ.. వరంగల్ నుంచి వచ్చి పర్యవేక్షిస్తున్నారని ఇక్కడివారు చెబుతుండటం గమనార్హం. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఐటీ హబ్-2 నిర్మాణ పనులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గుత్తేదారుకు దిశానిర్దేశం చేసేలా టీజీఐఐసీ అధికారులు, కలెక్టర్‌తో మంత్రి సమీక్ష జరపాలని విద్యానిపుణులు కోరుతున్నారు.

పిల్లర్ల దశలోనే ఐటీ హబ్-2 నిర్మాణ పనులు


ఐటీ హబ్-2 పనులు చకచకా జరిగేలా చొరవ చూపుతాం. గుత్తేదారు తీరు మారకపోతే నోటీసులు జారీ చేస్తాం. వీలైనంత త్వరగా ఐటీ హబ్-2ను అందుబాటులోకి తీసుకురావటమే మా లక్ష్యం.
- స్వామి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్, వరంగల్

వంద పడకల ఆసుపత్రిగా పాల్వంచ సీహెచ్‌సీ

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) వంద పడకల ఆసుపత్రిగా మారుస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీహెచ్‌సీలో రూ.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రక్తశుద్ధి (డయాలసిస్) కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డయాలసిస్ కేంద్రంలో రోగులకు రోజువారీగా మూడు దశల్లో చికిత్స అందిస్తారన్నారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలోనూ మరో డయాలసిస్ కేంద్రంలో 5 యూనిట్లను పెంచనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రం ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించడానికి వైద్యులు కృషిచేయాలన్నారు. డీసీహెచ్ఎస్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్ఎంవో సోమరాజుదొర, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుకృత, తహసీల్దార్ వివేక్, మున్సిపాలిటీ కమిషనర్ ఢాకునాయక్, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, టీపీసీసీ సభ్యుడు నాగసీతారాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

వీకే ఓసీకి తొలి దశ అనుమతులు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెం ఏరియాలోని వీకే ఉపరితల గనికి స్టేజ్-1 అనుమతులు లభించాయి. కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ కొద్దిరోజుల క్రితం ఈ మేరకు అనుమతులు ఇచ్చింది. ఇక పర్యావరణ అనుమతులు లభించాల్సి ఉంది. దీనికి మరో మూడు నెలల వ్యవధి పడుతుందని ఏరియా జీఎం షాలేమురాజు తెలిపారు.

ఇక ఎరువు.. బరువు కాదు..!

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఎరువుల సరఫరా ప్రక్రియను మరింత సులువు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు మొదలుపెట్టింది. ఎరువుల సరఫరాకు ప్రస్తుతం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్ మాత్రమే వ్యవహరిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మారుమూల ప్రాంతాల రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందుబాటులో లేకపోవటంతో వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఆగ్రోస్)ను మరో నోడల్ ఏజెన్సీగా సర్కారు ఎంపిక చేసింది. వచ్చే యాసంగి సీజన్ నుంచి ఆగ్రోస్ నేరుగా కంపెనీల నుంచి ఎరువులు తీసుకొచ్చి రైతులకు విక్రయించనుంది.



	ఖమ్మం	భద్రాద్రి
ఎరువుల దుకాణాలు	580	350
సహకార సంఘాలు	76	20

ఆగ్రోస్ సేవలు..

సుమారు రెండు దశాబ్దాల క్రితం 'ఆగ్రోస్' ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఆధునిక యంత్రాలు, పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేసింది. ఇందుకోసం అప్పట్లో జిల్లా స్థాయుల్లో ప్రత్యేకంగా ప్రాంతీయ కార్యాలయాలు ఉండేవి. నిధుల కొరతతో క్రమేణా ఇవి ప్రాభవం కోల్పోయి చివరికి మూతపడ్డాయి. సిబ్బందిని రాష్ట్ర స్థాయి కార్యాలయంలో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ప్రస్తుతం అంపశయ్యపై ఉన్న ఈసంస్థ ప్రాణాన్ని నిలబెట్టాలని సర్కారు యోచిస్తోంది. రైతులకు ఎరువులను సరఫరా చేసే బాధ్యతను అప్పగించాలని భావించింది. ఐదేళ్లుగా 'ఆగ్రోస్' రైతు సేవా కేంద్రాల ఏర్పాటుకు పూనుకున్న విషయం విదితమే. నిరుద్యోగ పట్టభద్రులు వీటిని నిర్వహించుకునేందుకు అనుమతించింది. ప్రస్తుతం వీటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయిస్తున్నారు.

కావాల్సిన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

ఎరువు	ఖమ్మం	భద్రాద్రి
యూరియా	85,693	42,788
డీఏపీ	33,765	14,280
కాంప్లెక్స్	89,928	44,744
ఎంఓపీ	27,672	13,650
ఎస్ఎస్‌పీ	2,750	9,868

రైతులకు మేలు..

మార్క్‌ఫెడ్ ద్వారానే కాకుండా 'ఆగ్రోస్'తో ఎరువులను సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తుండటం వల్ల రైతులకు మేలు జరగనుంది. తద్వారా ప్రతి గ్రామానికి సకాలంలో ఎరువులు అందనున్నాయి. అయితే ఇందుకు తగిన విధంగా 'ఆగ్రోస్' ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది. పెద్దఎత్తున ఎరువుల నిల్వల కోసం గోదాములను సమకూర్చుకోవాలి.

ఆగ్రోస్ ద్వారా ఎరువుల సరఫరా చేపడితే రైతులకు దూరభారం తగ్గుతుంది. దీనివల్ల ఖర్చు సైతం ఆదా అవుతుంది. సరఫరా కేంద్రాల సంఖ్య పెరగటం వల్ల వానాకాలం, యాసంగి సీజన్లలో అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందుతాయి.
- దనసరి పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

ఆర్టీసీకి దసరా ధమాకా

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

దసరా పండుగ సెలవులు ఆర్టీసీకి కాసులు కురిపించాయి. ఈనెల ఒకటో తారీఖు నుంచి 15 వరకు కొత్తగూడెం డివిజన్ పరిధిలోని భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం డిపోల పరిధిలో అదనపు సర్వీసులు నడిపించారు. ప్రతిరోజూ ఒక డిపో పరిధిలో ఐదు నుంచి ఏడు వరకు ప్రత్యేక బస్సులను రద్దీకి అనుగుణంగా సమకూర్చారు. గత 15 రోజులుగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. ఆక్యుపెన్సీ రేషియో సగటున 90 శాతం తగ్గకుండా నమోదుకావడం విశేషం. అత్యధికంగా 99.7 శాతం ఓఆర్‌తో కొత్తగూడెం డిపో ప్రథమ స్థానంలో నిలిచింది. నాలుగు డిపోల మొత్తం ఆదాయం రూ.10.51 కోట్లు ఆర్జించగా.. ఒక్క కొత్తగూడెం డిపో రూ.2.46 కోట్లతో అగ్రస్థానం దక్కించుకుంది.


కొత్తగూడెంలో కార్మికులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ (పాత చిత్రం)

ఈ నెల 1 నుంచి 15 వరకు డిపోల వారీగా....
● కి.మీ. (లక్షల్లో) ● ఆదాయం (రూ.కోట్లల్లో) ● ఓఆర్ (శాతం)



డిపో	కి.మీ. (లక్షల్లో)	ఆదాయం (రూ.కోట్లల్లో)	ఓఆర్ (శాతం)
భద్రాచలం	7.19	4.19	88
కొత్తగూడెం	3.87	2.47	99.7
మణుగూరు	5.25	3.19	94.15
ఇల్లెందు	1.27	0.65	93

కార్మికులకు సదుపాయాలు

దసరా పర్వదినాన్ని ఆదాయ మార్గంగా మలచుకునేందుకు ఆర్టీసీ యాజమాన్యం సరైన ప్రణాళికతో ముందుకు సాగింది. డిపో అధికారులను సమాయత్తం చేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆర్టీసీ ఈ ఏడాది కార్మికులకు దసరాకు మూడ్రోజుల పాటు (10, 13, 14 తేదీల్లో) మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించింది. డిపోల అధికారులు విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లకు భోజన ప్యాకెట్లు అందజేశారు. ఇదే సమయంలో అధికారుల నుంచి సూపర్‌వైజర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఉదయం నుంచి రాత్రి వరకు బస్సుల రాకపోకలు, ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. 'సమష్టిగా కలిసి రోజుకు ఐదారు సర్వీసులను ప్రత్యేకంగా నడిపించాం. రూ.4 లక్షలకు పైగా ఆదాయాన్ని అదనంగా ఆర్జించాం' అని కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

పెద్దలను చూసి పిల్లలు నేర్చుకుంటారనేది నానుడి. ఓ ఇద్దరు అక్కాచెల్లెళ్లు కూడా తండ్రిలాగే ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలని చిన్ననాటి నుంచి కలగన్నారు. కష్టపడి కొలువు సాధించారు. అదీ.. ఇద్దరూ ఒకేసారి కావడం విశేషం. బుధవారం ఉపాధ్యాయ వృత్తి ప్రారంభించిన సందర్భంగా వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది. – కొత్తగూడెం విద్యా విభాగం, న్యూస్‌టుడే

ఒకేసారి ఎస్జీటీ ఉపాధ్యాయినులుగా ఎంపిక

తండ్రి బాటలో తనయలు



తల్లిదండ్రులతో అంజలి, దీప్తి

ఏన్కూరు మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన గణపురం శ్రీనివాసరావు, పుష్పవతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. అంజలి, దీప్తి. శ్రీనివాసరావు ఖమ్మం గ్రామీణ మండలం, గుదిమళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు. ఆయన ప్రభావం కూతుళ్లపై ఎంతో ఉంది. దీంతో తాము ఉపాధ్యాయులుగా స్థిరపడాలని చిన్ననాటి నుంచే అనుకున్నారు. విద్యాభ్యాసం మొత్తం లక్ష్యం వైపే కొనసాగేలా జాగ్రత్తపడ్డారు. కోర్సులు పూర్తయిన డీఎస్సీకి ప్రణాళిక, పట్టుదలతో సన్నద్ధత అవుతున్న సమయంలోనే 2024 మార్చిలో నోటిఫికేషన్ వెలువడింది. ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో చేజార్చుకోవద్దని మరింత పట్టుదలతో, తండ్రి దిశా నిర్దేశంలో సన్నద్ధత కొనసాగించారు. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) విభాగంలో ఇద్దరూ జిల్లా స్థాయి ర్యాంకులు సాధించి శెభాష్ అనిపించుకున్నారు.

☆ పెద్దమ్మాయి అంజలి డీఎస్సీలో జిల్లా స్థాయి 180వ ర్యాంక్ సాధించారు. పినపాక మండలం గొట్టెగూడెం ప్రాథమిక పాఠశాలలో తొలిపోస్టింగ్‌లో చేరారు. బోధన వృత్తిని ఆరంభించారు. ఆమె.. ఎమ్మెస్సీ, బీఈడీ చదివారు. చిన్నమ్మాయి దీప్తి డీఎస్సీలో 79వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. అశ్వాపురం మండలం వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా బోధనను ప్రారంభించారు. ఆమె విద్యాభ్యాసమంతా ఇల్లెందు మండలంలో కొనసాగింది. బీఎస్సీ, డీఎడ్‌ను వరంగల్, ఖమ్మంలో పూర్తి చేశారు. ఉన్నత విద్య కోర్సులు పూర్తయిన వెంటనే సర్కారు కొలువులు సాధించడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు.

'రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరించడం సంతోషంగా ఉంది. ఈ అవకాశాన్ని మాలాంటి వారెందరో సద్వినియోగం చేసుకుని ఎంతో విలువైన బోధనా వృత్తిని చేపట్టారు. ఈ అవకాశం అదృష్టంగా భావిస్తున్నాం. ఇష్టంతో కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా సాధించవచ్చు.' - అంజలి, దీప్తి

బంతాటలో ఇంతుల జోరు

ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న ఆ నలుగురు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల ప్రత్యక్ష ప్రసారాలను చూసి ప్రభావితమయ్యే వారు మైదానాలకు వస్తున్నారు. కొద్ది రోజుల సాధన తర్వాత ఇది 'చూసినంత తేలిక కాదు, చాలా కష్టం, 'పేగులు కదిలిపోతున్నాయ్' అంటూ ఎక్కువ మంది ఆటకు దూరమవుతున్నారు. చెమటలు కక్కుతూ.. పడుతూ లేస్తూ.. గాయాలపాలవుతూ ఏళ్ల తరబడి సాధన.. బంతిని పూర్తిస్థాయిలో నియంత్రించే పట్టు సాధించాల్సి ఉంటుంది. ఇంతటి కఠినమైన ఆటను ఎంచుకున్నారు.. జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారిణులు.. అంతటితో ఆగిపోలేదు.. వీరు ఫుట్‌బాల్ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే సీనియర్ నేషనల్స్ పోటీలకు అర్హత సాధించారు.



ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా ఫుట్‌బాల్ పోటీలో ఖమ్మం జిల్లా జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఖమ్మం జిల్లా జట్టులో ప్రతిభావంతంగా రాణించిన క్రీడాకారిణులు అఖిల, కావ్య, శ్రీలక్ష్మి, అలేఖ్య సీనియర్ నేషనల్స్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టులో స్థానం పొందారు. జాతీయ పోటీలు పశ్చిమ బంగా రాష్ట్రంలోని సిలిగురిలో జరుగనున్న జాతీయ టోర్నీలో తమ ప్రతిభాపాటవాలు చూపనున్నారు. సీనియర్ నేషనల్స్‌లో పాల్గొనడమే ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎక్కువగా దృష్టి సారిస్తారు. ఇప్పుడు ఆడుతున్న నలుగురు క్రీడాకారిణులు ఇప్పటికే రెండు నుంచి నాలుగు సార్లు సీనియర్ నేషనల్స్ ఆడి ఉన్నారు. ఇదిలా ఉంటే వీరిలో కావ్య హైదరాబాదులో కానిస్టేబుల్‌గా విధుల్లో ఉంటూనే జిల్లా ఫుట్‌బాల్ రంగంలో తన ప్రస్థానం కొనసాగిస్తోంది. జాతీయ పోటీల్లో ఇప్పుడు పాల్గొనడం ఇది ఆరోసారి. అలేఖ్య ఓ అడుగు ముందుకేసి ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్స్ పోటీలో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. శ్రీలక్ష్మి ఖమ్మం ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో చదువుకుంటూనే ఫుట్‌బాల్ రంగంపై దృష్టి సారించింది. రెండోసారి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. అఖిల ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం దక్కించుకొంది. తనూ స్కూల్ దశ నుంచి ఫుట్‌బాల్ సాధనలో ఉంది. జూనియర్, సీనియర్ జాతీయ పోటీల్లో పాల్గొన్న అనుభవం సొంతం చేసుకుని రెండోసారి సీనియర్ జాతీయ పోటీలకు బయలుదేరింది. మహిళా ఫుట్‌బాల్‌పై ఎక్కువ దృష్టి సారించిన ఫలితంగా వీరి సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారుల ప్రతిభాపాటవాలు మెచ్చిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రూ.1.5 లక్షలు స్వయంగా అందజేశారు. నిరంతరాయంగా పాఠశాల స్థాయి నుంచి కళాశాల వరకు క్రీడాకారులు చేజారకుండా చూడటంతో నేడు మహిళా ఫుట్‌బాల్ రంగం మంచి సంఖ్యలో క్రీడాకారులు, అంతే ఫలితాలు చూస్తున్నామని జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఆదర్శ్ చెప్పారు.



అఖిల, కావ్య, అలేఖ్య, శ్రీలక్ష్మి



రాములోరికి ఘనంగా తిరుమంజనం

☆ నేడు శబరిమాత ఉత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. వారానికి ఒకసారి ఉండే ఈ వేడుక ఆధ్యాత్మికతను పెంచింది. ప్రధాన ఆలయంలో కొలువైన కోదండ రాముడికి అర్చకులు సుప్రభాతం పలికి నామార్చన చేశారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచించారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. సీతాదేవికి యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీతధారణ భక్తిశ్రద్ధలతో సాగాయి. కల్యాణోత్సవంలో మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక భక్తులకు పరమానందాన్ని కలిగించాయి. దర్బారు సేవలో హరిదాసులు కీర్తనలు ఆలపించారు. గురువారం భద్రాచలం రామాలయంతో పాటు అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో శబరిమాత వార్షిక ఉత్సవాన్ని గిరిజన సంప్రదాయంలో నిర్వహించేందుకు ఈఓ రమాదేవి ఏర్పాట్లు చేపట్టారు.

పచ్చదనం మధ్య పట్టాలు



పచ్చదనం మధ్య ఈ పట్టాలు గొందిగూడెం వద్ద కొత్తగూడెం-మణుగూరు రైల్వే మార్గానికి చెందినవి.. అశ్వాపురం మండలంలోని గొందిగూడెం, తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామ పంచాయతీల పరిధిలో ఈ మార్గం ఎక్కడాలేని విధంగా పచ్చని గుట్టలు, అడవులు, చెరువుల పక్క నుంచి అనేక వంపులు తిరుగుతూ ప్రకృతి సోయగాల మధ్య కొనసాగుతుంది. మణుగూరు నుంచి తొలుత ప్రయాణమే గుట్ట దిగువ భాగం నుంచి మొదలవుతుంది. గొందిగూడెం వద్ద పెద్ద వంపు తిరుగుతుంది. రెండు గుట్టల మధ్య ప్రవేశిస్తుంది. యూ ఆకారంలో వంపు తిరుగుతుంది. కాకతీయుల ప్రసిద్ధ సాగు నీటి వనరు తుమ్మలచెరువును ఆనుకుని ఎస్ ఆకారంలో అనేక వంపులు తిరుగుతూ ప్రయాణం కొనసాగుతుంది. పాండురంగాపురం వరకు ఓ వైపు గుట్ట, మరో వైపు అడవుల మధ్య నుంచి, పలు చెరువుల వంతెనలపై నుంచి కొనసాగే ఈ ప్రయాణం ప్రయాణికుల్లో ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

– మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే

కొనసాగుతున్న ఆర్థికసాయం

ఈనాడు కథనానికి స్పందన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించిన పేదింటి గిరి పుత్రిక రాజిని శివభార్గవికి మానవతావాదులు అండగా నిలుస్తున్నారు. సింగర్ శ్రీకాంత్ రూ.50 వేలు, పద్మావతి రూ.50 వేలు, కిరణ్ రూ.25 వేలు, భార్గవి రూ.10 వేలు, జనగా వెంకటేశ్ రూ.10 వేల చొప్పున రూ.1.45 లక్షలను బుధవారం ఆమెకు ఫోన్‌పే, ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. ఇప్పటి వరకు విద్యార్థికి మొత్తం రూ.2.40 లక్షలు సమకూరాయి. అంతేగాకుండా పలువురు ఎన్‌ఆర్‌ఐలు కూడా తమవంతుగా సాయం చేస్తామని ఫోన్ చేసి భరోసా ఇచ్చారు.

చిరుత కోసం ట్రాపింగ్ కెమెరా ఏర్పాటు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు అటవీ రేంజిలోని ఎర్రగుట్ట ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత జాడలను తెలుసుకునేందుకు అటవీశాఖ అధికారులు ట్రాపింగ్ కెమెరాను అమర్చారు. జూలూరుపాడు మండలం మున్యాతండాకు చెందిన రైతు తోటలో శునకాన్ని ఎత్తుకెళ్లిన ప్రదేశంలో కెమెరా ఏర్పాటు చేసి కదలికలను గమనిస్తున్నట్లు ఎఫ్‌ఆర్వో ప్రసాదరావు బుధవారం తెలిపారు. గుట్టకు ఆవల వైపు ఉన్న సూరారం ప్రాంతంలోని జామాయిల్ ప్లాంటేషన్ వైపు వెళ్లినట్లు పాదముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే ఎలాంటి అలజడి చేయకుండా ఉన్నట్లయితే దాన్ని గుర్తించే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై ఆ ప్రాంత రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నట్లు వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో కెమెరాకు చిరుత చిక్కినట్లు వస్తున్న చిత్రాలు నకిలీవని, తాము అమర్చిన వాటికి చిక్కితే అధికారికంగా విడుదల చేస్తామన్నారు.

తండ్రి చేతిలో కుమారుడి హతం



గణేశ్

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఘర్షణ పడిన కుమారుడిని తండ్రి ఆయుధంతో కొట్టి చంపిన ఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ కథనం మేరకు.. నగర శివారు రామన్నపేట కాలనీకి చెందిన కొంపెల్లి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు గణేశ్(30) కారు డ్రైవర్‌గా పనిచేసేవారు. అతనికి ఐదేళ్ల క్రితం వివాహమై విడాకులు అవడంతో మద్యానికి బానిసై తల్లిదండ్రులు, సోదరుడితో తరచూ ఘర్షణ పడుతున్నారు. తల్లి, పెద్ద కోడలు ఊరికి వెళ్లడంతో మంగళవారం తండ్రి కొడుకులు ముగ్గురే ఇంట్లో ఉన్నారు. రాత్రివేళ మద్యం తాగిన వెంకటేశ్వర్లు, గణేశ్ ఘర్షణ పడుతుండటంతో పెద్ద కుమారుడు నాగేంద్రబాబు బయటకు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో పక్కింటి వారు సమాచారం ఇవ్వడంతో తిరిగి వచ్చిన నాగేంద్రబాబుకు మంచంపై గణేశ్ రక్తపు మడుగులో పడి చనిపోయి కనిపించారు. అతని నుదుటిపై బలమైన గాయం ఉంది. వెంకటేశ్వర్లు కంగారుగా ఇంటి నుంచి పరుగెత్తారని స్థానికులు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నారని, హత్యకు ఉపయోగించిన ఆయుధం లభించలేదని వెల్లడించారు.

హరిత హోటల్ రోజువారీ కార్మికుడి మృతిపై ఆందోళన



స్థానిక హరిత హోటల్ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: హోటల్ మేనేజరు పనిలో నుంచి తీసివేయడంతోనే మనో వేదనకు గురై ఇసంపల్లి నర్సింహారావు(40) మృతిచెందాడని ఆరోపిస్తూ అతని బంధువులు బుధవారం ఆ హోటల్ వద్ద మృతదేహంతో ఆందోళనకు దిగారు. వివరాలను పరిశీలిస్తే.. భద్రాచలం హరిత హోటల్‌లో పనిచేసే దినసరి వేతన కార్మికుడు నర్సింహారావును పనిలోకి రావొద్దని నెల రోజుల కిందట నిర్వాహకులు తొలగించారు. ఇంటివద్దనే ఉన్న కార్మికుడు గుండెనొప్పితో బుధవారం మృతి చెందాడు. దీంతో అతని బంధువులు ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి ఆందోళన విరమించి హోటల్ ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని సూచించారు. దీంతో వారు ఆందోళన విరమించారు. తన భర్తను మేనేజరు నాగలక్ష్మి విధుల నుంచి తొలగించడంతోనే మనోవేదనకు గురై గుండెనొప్పితో మృతిచెందాడని, ఆమెపై చర్యలు తీసుకోవాలని నర్సింహారావు భార్య లలిత స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'సీతారామ' కాలువలో మొసలి సంచారం



బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ సమీపంలోని సీతారామ ప్రాజెక్టు కాలువలో బుధవారం మొసలిని కనుగొన్నారు. పరిసర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ అధికారులు, అటవీశాఖ అధికారులు సూచించారు. పశువులు, జీవాలు నీళ్ల దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కాలువ వద్దకు ఎవరూ వెళ్లరాదని పేర్కొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు వద్ద బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 5 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఒడిశా మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తూ మల్కన్‌గిరికి చెందిన ముద్దా కిశోర్, కరణ్ రాంబాబు, కరణ్ ఎర్రయ్యలు పట్టుబడ్డారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కొత్తగూడెం ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ కరీం, బాలు, సిబ్బంది సుధీర్, వెంకట్, హనుమంతరావు పాల్గొన్నారు.



గంజాయితో పట్టుబడిన యువకులు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: కొత్తగూడెం పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన ఒకరోజు ఆలస్యంగా వెలుగు చూసింది. దసరా సెలవుల్లో ఇచ్చిన హోంవర్కును పూర్తి చేయలేదనే కారణంతో ఉపాధ్యాయుడు గణేశ్‌టెంపుల్ ఏరియాకు చెందిన పదేళ్ల బాలుడిని మంగళవారం చితకబాదాడు. ఒంటిపై వాతలు తేలడంతో తల్లిదండ్రులు బుధవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఉపాధ్యాయుణ్ని పిలిపించి మాట్లాడారు. తల్లిదండ్రులకు పలువురు ఉపాధ్యాయులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

బెదిరించిన ముగ్గురు వ్యక్తుల అరెస్టు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ఓ ఆసుపత్రి ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా కల్పిత వార్తను రూపొందించి ఏటా రూ.5లక్షలు యాడ్ రూపంలో చెల్లించాలంటూ బెదిరించిన ముగ్గురు యూట్యూబ్ ఛానల్ వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నామని ఖమ్మం ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన ఛానల్ సీఈఓ పుచ్చకాయల ప్రకాశ్, బ్యూరో చీఫ్ అత్తులూరి రామకృష్ణ(రాంకీ), ఖమ్మానికి చెందిన అసిస్టెంట్ కెమెరామెన్ షేక్ బాబాలపై దోపిడీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య

సత్తుపల్లి, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడంలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్తుపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెరుకుపల్లి పంచాయతీ తురకలగూడెంకు చెందిన పొట్టా పవన్(27) కిష్టారానికి చెందిన ధనలక్ష్మిని ఏడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండగా రెండు నెలల క్రితం ధనలక్ష్మి పుట్టింటికి వచ్చి ఉంటోంది. దీంతో పవన్ మద్యానికి బానిసై మనస్తాపంతో బుధవారం తెల్లవారుజామున పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను సత్తుపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పొట్టా పవన్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సీతారామపురంలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన దుర్ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై గణేశ్ కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన వికాస్‌కుమార్(28) సీతారామపురంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవన పనులకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం విద్యుత్తు వైరింగ్ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తోటి కార్మికులు అతడిని వెంటనే భద్రాచలంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్..

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ తుటారి శివప్రసాద్ (58) గుండెపోటుతో బుధవారం మరణించారు. శివప్రసాద్ లక్ష్మీదేవిపల్లి శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో నున్న ఈవీఎంల గోదాము వద్ద గార్డ్ డ్యూటీ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్నట్లుండి అస్వస్థతకు గురికావడంతో వెంటనే కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మరణించినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు బాలురిపై పోక్సో కేసు

బోనకల్లు, న్యూస్‌టుడే: ఇద్దరు బాలురిపై పోక్సో కేసు నమోదు మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. ఏడేళ్ల బాలికపై తొమ్మిదేళ్ల వయసున్న ఇద్దరు బాలురు అత్యాచారయత్నం చేయగా బాలిక అరవడంతో పరారయ్యారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 13న ఈ ఘటన జరగ్గా పెద్దమనుషుల పరిష్కారం కోసం ప్రయత్నించారు. పరిష్కారంలో న్యాయం జరగలేదని బాలిక తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌కు రావడంతో ఎస్సై మధుబాబు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

గిరిజన విద్యాలయాల్లో...

ముఖ గుర్తింపుతో హాజరు

భద్రాచలం, న్యూస్‌టుడే

గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని విద్యాలయాలలో ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా హాజరు సేకరణ చేస్తున్నారు. భద్రాచలం ఐటీడీఏ డీడీ ఆధ్వర్యంలో దీనిపై పర్యవేక్షణ పెంచారు. తరగతిలో ఉపాధ్యాయులు స్మార్ట్ ఫోన్‌లో ప్రత్యేకమైన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రతిరోజు ఉదయం ముఖ గుర్తింపు పద్ధతిలో హాజరు తీసుకుంటున్నారు. విద్యార్థులను ఎదురుగా ఉంచి వారి ముఖాన్ని ఫోన్‌లో ఫొటో తీయగానే వారు పాఠశాలకు వచ్చినట్లు హాజరు పడుతుంది. ఒకసారి హాజరు పడితే ఆ విద్యార్థి తరగతి గదిలో ఉన్నట్లే. కచ్చితమైన మెనూ పాటించేందుకు ఈ విధానం సహకరిస్తుంది. హాజరులో డబుల్ ఎంట్రీకి అవకాశం ఉండదు. గైర్హాజరైన వారి వివరాలు ప్రధానోపాధ్యాయుడికి చేరడం వల్ల ఏ తరగతిలో గైర్హాజరు ఎంత ఉందో స్పష్టత వస్తుంది. బడికి రాని వారిని వచ్చేలా చేసేందుకు వెంటనే వారి కుటుంబ సభ్యులకు ఈ సమాచారం చేరవేస్తున్నారు. అయితే వేర్వేరు కారణాలతో కొన్ని విద్యాలయాల్లో పాత విధానంలోనే హాజరు తీసుకుంటున్నారు. అక్కడా నూతన విధానం అమలుకు చర్యలు చేపట్టనున్నారు.

ఉపాధ్యాయులకూ వర్తింపు..

ఉపాధ్యాయుల హాజరును ఇదే విధానంలో ప్రధానోపాధ్యాయులు నమోదు చేస్తారు. వారు సమయానికి రాకపోతే హాజరు పడదు. ఎక్కడైతే విధులు నిర్వహిస్తున్నారో ఆ ప్రాంగణంలోనే ముఖ గుర్తింపు వర్తిస్తుంది. ఆ పరిధి దాటితే ఎఫ్‌ఆర్‌ఎస్ వర్తించదు. ప్రతిరోజు డీడీ కార్యాలయంలోని ప్రత్యేక విభాగానికి ఈ హాజరు వివరాలను పంపిస్తున్నారు. గైర్హాజరైతే ఎందుకు రాలేదన్నది వివరణ కోరుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఫోన్‌కు సిగ్నల్ అందని ప్రాంతాల్లో ముఖ గుర్తింపు హాజరుకు చిక్కులు తలెత్తుతున్నాయి.



ఫోన్ యాప్ సాయంతో విద్యార్థి హాజరు సేకరణ

విద్యాలయాలు	సంఖ్య	విద్యార్థులు	ఉపాధ్యాయులు/ సంక్షేమ అధికారులు
గిరిజన ప్రాథమిక పాఠశాలలు	219	4,868	414
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	50	14,863	876
గిరిజన వసతి గృహాలు	13	1,263	13
పోస్టు మెట్రిక్ వసతి గృహాలు	22	3,000	22

విద్యా ప్రమాణాలు పెంచాలని..

విద్యార్థులు ప్రగతి సాధించాలన్నదే లక్ష్యంగా పీఓ రాహుల్ చర్యలు చేపట్టారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు గణితం, ఆంగ్లంలో పట్టు పెంచేందుకు నిపుణులతో ఈ రెండు అంశాలపై వర్క్ బుక్‌లు తయారు చేయించారు. త్వరలో వీటిని అందించనున్నారు. దాదాపు 2 వేల మంది పదో తరగతి చదువుతున్నందున ఎస్‌ఏ-1 పరీక్షల ఫలితాల ఆధారంగా గ్రేడ్లు గుర్తించి వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్ణయించారు. పబ్లిక్ పరీక్షలకు ముందు 100 రోజుల పాటు స్లిప్ టెస్టులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరు అత్యుత్తమ ప్రతిభ చాటాలన్నదే ధ్యేయంగా ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

రోడ్డు ప్రమాద బాధితులకు పశువైద్యుల వితరణ



ప్రమాదంలో గాయపడిన ప్రవీణ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న పశువైద్యులు

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లి మండలం సీతారాంపురం శివారులో గత నెల 17న రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన నలుగురు విద్యార్థుల కుటుంబాలకు పశువైద్యుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం లక్ష రూపాయల నగదును అందజేశారు. పశువైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదానికి గురవడం బాధాకరమన్నారు. డాక్టర్ రాజేశ్వరరావు, రామకృష్ణ, బద్దులాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వినాయకపురంలో శబరి స్మృతి యాత్ర

అశ్వారావుపేట గ్రామీణం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వినాయకపురంలో గురువారం శబరి స్మృతియాత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం గ్రామంలో ప్రచార రథంపై స్వామివారు శోభాయాత్రగా శ్రీచిలకలగండి ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం సీతారామచంద్రస్వామి వారి ప్రచారమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

అట్టడుగు వర్గాలకు అండగా ఉంటాం: పాయం



కిన్నెరసాని వాగు దాటుతున్న ఎమ్మెల్యే పాయం తదితరులు

ఆళ్లపల్లి, బూర్గంపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆళ్లపల్లి మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. బోడాయికుంట, నడిమిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో పంచాయతీ స్థాయి సమీక్ష సమావేశాన్ని అధికారులతో నిర్వహించారు. విద్య, వైద్యం, తాగునీరు, వ్యవసాయం, రహదారులు, విద్యుత్తు తదితర అంశలపై అధికారులతో సమీక్షించారు. ఆళ్లపల్లిలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాయగూడెం గ్రామానికి వెళ్లే మార్గంమధ్యలో కిన్నెరసాని వాగు దాటి అక్కడి ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. తహసీల్దార్ శకుంతల, ఎంపీడీవో శ్రీను, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు రామనర్సయ్య, సమ్మయ్య, కాంత్, శ్రీకాంత్, భరత్, రవి, రాము తదితరులు పాల్గొన్నారు.

★ బూర్గంపాడు మండలం బుడ్డగూడెం గ్రామానికి చెందిన సారయ్య, నరేశ్ మంగళవారం రహదారి ప్రమాదంలో మృతి చెందారు. వీరి మృతదేహాలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట 132/33 కేవీ విద్యుత్తు కేంద్రంలో గురువారం మరమ్మతులు చేస్తున్నందున వినాయకపురం, నారాయణపురం, గంగారంలోని 33/11 కేవీ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని ఏఈఈ సంతోష్ తెలిపారు.

నాణ్యతకు తిలోదకాలు..!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే



మురుగు కాలువ నిర్మాణం మధ్యలోనే కూలిన కాంక్రీటు గోడ

అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పనుల నిర్వహణలో గుత్తేదారులు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. కాంక్రీటు పనులు దగ్గరుండి పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో గుత్తేదారులు ఆడింది ఆట, పాడింది పాటగా మారడంతో పనులు చేస్తుండగానే కాలువ కాంక్రీటు గోడలు కూలుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

★ ఖమ్మం-దేవరపల్లి మార్గంలో అశ్వారావుపేట పట్టణంలో పేరాయిగూడెం పంచాయతీ కార్యాలయం నుంచి కాకతీయ గేటు వరకూ జాతీయ రహదారికి రెండువైపులా రూ.10కోట్లతో మురుగు నీటి పారుదల కాలువలు, మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ తదితర నిర్మాణ పనులకు 2023 జులైలో శంకుస్థాపన జరిగింది. గత ఏడాది పనులు ప్రారంభించినా మధ్యలో అనివార్య కారణాలతో గుత్తేదారు నిలిపివేశారు. అయిదు నెలల కిందట మరోసారి మురుగునీటి కాలువలు(డ్రైనేజీ) నిర్మాణ పనిని ఓ గుత్తేదారు ప్రారంభించారు. ఇదిలాఉండగా సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి కాలువల్లోంచి భారీగా వరదనీరు రావడంతో ఖమ్మం మార్గంలో ఓ రెస్టారెంట్ సమీపంలో వంతెన వద్ద కట్టిన కాలువ కాంక్రీటు గోడలు కూలిపోయాయి. సుమారు 15 మీటర్లు కూలిపోవడంతో గుత్తేదారు హుటాహుటిన మంగళవారం ఉదయమే కూలిన ప్రదేశంలో కాంక్రీటు గోడ నిర్మాణ పనిని ప్రారంభించారు.

★ గతంలోను ఇదేమాదిరి పేరాయిగూడెం ఆంజనేయస్వామి గుడి వద్ద గోడలు కూలాయి. ఇలా నిర్మాణం మధ్యలో కాంక్రీటు గోడలు కూలడం ఇది రెండో సారి. కాంక్రీటులో ఇసుకపాళ్లు ఎక్కువగా, సిమెంటు తక్కువగా వేయడం వల్లనే నాణ్యత లోపిస్తోందన్న ఆరోపణలున్నాయి. నిర్మాణ సమయంలోనే కాంక్రీటు బెడ్ ఎక్కడికక్కడ కొట్టుకుపోవడం, కాంక్రీటు గోడలు కూలిపోవడాన్ని చూస్తే గుత్తేదారులు చేస్తున్న పనుల్లో నాణ్యతా లోపం తేటతెల్లం అవుతోంది. దగ్గరుండి పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం సమీపంలో కనిపించని దుస్థితి నెలకొంది.

★ దీనిపై ర.భ.శాఖ డీఈఈ శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సోమవారం సాయంత్రం భారీ వర్షం వచ్చిన సమయంలో మురుగునీటి కాలువ పక్కనే ఉంచిన జేసీబీ వరద ప్రవాహంతో కాంక్రీటు గోడపై పడటంతో గోడలు కూలిపోయాయని, వెంటనే పునరుద్ధరిస్తామని అన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033



సమస్య: గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డు ఉండగా కూడా చెత్తను అంతా మంగలిచెలక రోడ్ల పక్కనే పారబోస్తున్నారు. - **కట్టం రోహిత్, మంగలిచెలక**

సమాధానం: వర్షాలకు డంపింగ్ యార్డుకు రహదారి లేకపోవడంతో చెత్తను అక్కడ పారబోశారు. అంతా తొలగిస్తాం. మళ్లీ అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం.

- టి.శైలజ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, చింతిర్యాల

– అశ్వాపురం, న్యూస్‌టుడే

జమ్మిగూడెంలో మురుగు కాలువల్లో చెత్తాచెదారం చేరి నీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో కాలువల్లో మురుగు నిలువ ఉండటంతో దోమలు వృద్ధి చెందటంతో పాటు దుర్వాసన వ్యాపిస్తోంది. పూడిక తీయించాలి. **వెంకటేశ్వరరావు, గ్రామస్థుడు**

✔ మురుగు నీటి కాలువల్లో చేరిన చెత్తను తొలగించే చర్యలు చేపడతాం. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

- కార్తిక్, పంచాయతీ కార్యదర్శి

– అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

గౌరారం, పైడిగూడెం మధ్య త్రీఫేజ్ విద్యుత్తు తీగ తెగి రైతుల పంట పొలాల్లో పడి ప్రమాదకరంగా మారింది. **- స్థానిక రైతులు**

✔ వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపడతాం. **- మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ**

– దుమ్ముగూడెం, న్యూస్‌టుడే



భద్రాచలం గోదావరి నది వంతెనపై నుంచి సారపాక వెళ్తున్న క్రమంలో పక్కన ముళ్లకంప ఏపుగా పెరిగి వాహనాలపై వెళ్లేవారికి తగులుతూ ఇబ్బందిగా మారింది. పంచాయతీ అధికారులు తక్షణమే తొలగించే చర్యలు చేపట్టాలి. **- రవి, భద్రాచలం**

✔ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ముళ్లకంప తక్షణమే తొలగించే ఏర్పాట్లు చేస్తాం. **- సీహెచ్ శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ**

– భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లి విజయపురి కాలనీ బీసీ హాస్టల్ సమీపంలో వీధి దీపం వెలగకపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా..'లో బుధవారం ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి రవి స్పందించి సమస్యను పరిష్కరించారు.

వైద్య సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

గుండాల, న్యూస్‌టుడే: ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సాయనపల్లి గ్రామానికి చెందిన ఇర్ప అమృతరాణి, బేబీప్రసన్నకు వాసవీక్లబ్ గ్రీన్‌ఫీల్డ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం గుండాలలో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థినిలు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి సీటు సాధించడం హర్షించతగ్గ విషయమని అభినందించారు. కార్యక్రమంలో నారాయణమూర్తి, నాగరాజు, రాంబాబు, శ్రీశైలం, పూజిత్, నాగమల్లయ్య, వీరన్న, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు, న్యూస్‌టుడే: సారపాకకు చెందిన మాడుగుల నరసింహారావు-రమాదేవి దంపతుల కుమార్తె సుజిత ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థినిని నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఉప్పెర్ల సీతారాములు, ఉప్పెర్ల అన్నారావు, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెలయేరు.. వెండిమబ్బుల దోబూచులాట



గలగలపారే సెలయేరు అవతలివైపు నది ఒడ్డున నేలకుజారిన వెండి మబ్బులు పలువురిని కనువిందు చేస్తున్నాయి. గుండాల-ఆళ్లపల్లి మార్గంలోని కిన్నెరసాని, జల్లేరు వాగులు నిత్యం గలగల పారుతూనే ఉంటాయి. వాగు ఇవతలివైపు నుంచి చూస్తే పారే వాగులు, వెండిమబ్బులు దోబూచులాడుతున్నట్లుగా కనిపిస్తుంది. ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' ఛాయాగ్రాహకంలో నిక్షిప్తం చేసింది. – గుండాల, న్యూస్‌టుడే

అగ్నికీలలు కాదు సూర్యకిరణాలే..!



కర్మాగారానికి అగ్నికీలలు వ్యాపించినట్లు కనిపిస్తుంది కదూ కానీ అవి సూర్యోదయపు ఉషస్సులే. బుధవారం ఉదయం బీటీపీఎస్ కర్మాగారం మీదుగా సూర్యుని కాంతి ప్రసరించింది. ఓ వైపు పచ్చని పొలాలు.. మరో వైపు సూర్య కాంతిలో కర్మాగారం చూపరులకు కనువిందు కలిగించాయి. ఈ చిత్రాలను 'న్యూస్‌టుడే' ఛాయాగ్రాహకంలో బంధించింది. – పినపాక, న్యూస్‌టుడే

ఓటరు నమోదు శిక్షణ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు శిక్షణ కార్యక్రమాన్ని భద్రాచలం కొర్రాజుల గుట్ట(నన్నపనేని) పాఠశాలలో ఎంఈఓ రమ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటరు నమోదు ఫారం-19లో ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు.

'వలస వాదులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు'

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో వలస వాదులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దని భద్రాద్రి యువజన ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ అధికారులను విజ్ఞప్తి చేశారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు వారికి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం వల్ల స్థానికులకు ఇబ్బంది ఏర్పడుతోందని ఆవేదన చెందారు. శాంతకుమార్, శివ, శ్రీను, వేణు, కిరణ్, ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ప్రత్యేక కమిటీలు పూర్తి

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ప్రత్యేక కమిటీల నియామకం పూర్తయినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అన్ని నియమ, నిబంధనల ప్రకారం కమిటీలను పూర్తి చేశామన్నారు. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ★ కాంగ్రెస్ పార్టీ సభ్యుల పేర్లనే ఇందిరమ్మ ప్రత్యేక కమిటీల్లో రాసుకున్నారని, నియమ, నిబంధనలంటూ ఏమీలేవని భారాస మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.

'జమిలి ఎన్నిక'తో ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం



సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

పినపాక, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎప్పుడు ఎన్నికలు వస్తే అప్పుడే నిర్వహించాలని జమిలి ఎన్నిక విధానంతో వ్యవస్థకు విఘాతం కలుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. పినపాక మండలం ఏడూళ్లబయ్యారం అడ్డరోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన మండల కమిటీ సభ్యులు, గ్రామ శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా అధికారంలోకి వచ్చాక ప్రజలపై పన్నుల భారం అధికమైందన్నారు. మహిళలకు రక్షణకు లేకుండా పోయిందని విమర్శించారు. సమావేశంలో మడివి రమేశ్, నిమ్మల వెంకన్న, శంకరయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడుగురు సభ్యులతో కూడిన ఇందిరమ్మ కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. మణుగూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలలో రాజకీయాలకతీతంగా సభ్యులను నియమిస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు రాములు, నాగేశ్వరరావు, లెనిన్‌బాబు, పద్మ, సుధాకర్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీజే బాక్సులు వినియోగిస్తే చర్యలు: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో డీజే బాక్సులు ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అధిక శబ్దం వచ్చే పరికరాల వినియోగంపై పోలీస్ చట్టం నిబంధనల ప్రకారం తాజాగా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు సాయంత్రం 6 గంటల వరకు నిబంధన అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

పంచదార బస్తాల లారీ బోల్తా




అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా నుంచి భువనేశ్వర్‌కు పంచదార బస్తాలు తీసుకు వెళ్తున్న లారీ అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలో బుధవారం బోల్తా పడింది. ఇదే సమయంలో లారీ పక్క నుంచి వెళ్తున్న రెండు ద్విచక్రవాహన చోదకులపై పంచదార బస్తాలు పడ్డాయి. అదృష్టవశాత్తు సమీపంలోనే నర్సరీల్లో పనిచేస్తున్నవారు గమనించి వారిపై పడిన బస్తాలను తొలగించారు. దీంతో వారు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. జాతీయ రహదారిపై ఒక పక్కన బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఘటన స్థలికి వెళ్లిన పోలీసులు రహదారిపై పడిన బస్తాలను తొలగించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అశ్వాపురంపాడులో వైద్యశిబిరం

కరకగూడెం, న్యూస్‌టుడే: అశ్వాపురంపాడులో కరకగూడెం ప్రభుత్వ వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 36 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, రోగులకు మందుల పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి పోలెబోయిన క్రిష్ణయ్య, కృష్ణ, ఆశా కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు విశ్రాంత ఉద్యోగుల వినతి



భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు ఉద్యోగుల సంఘం సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని, స్థలం కేటాయించి సంఘ శాశ్వత భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బంధు వెంకటేశ్వరరావు, చల్లగుళ్ల నాగేశ్వరరావు, ఎల్వీ ప్రసాద్, కృష్ణమూర్తి, సుబ్బయ్య, రాజబాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అమ్మవారి శోభాయాత్ర



అశ్వారావుపేట, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అశ్వారావుపేటలో అమ్మవారి శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పది రోజులపాటు పూజలందుకున్న అమ్మవారికి బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. పలురకాల అలంకారాలు, వేషధారణలతో పురవీధుల్లో శోభాయాత్ర ఘనంగా జరిగింది.

'కార్మిక సంఘాల విలీన సభను జయప్రదం చేయండి'

ములకలపల్లి, న్యూస్‌టుడే: మూడు కార్మిక సంఘాల విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ములకలపల్లిలో గోడ పత్రాలను ఆవిష్కరించారు. సంఘ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు మాట్లాడుతూ భారతదేశంలోని 14 రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికుల కోసం పనిచేస్తున్న మూడు విప్లవ కార్మిక సంఘాలు ఐఎఫ్‌టీయూలో విలీనాన్ని పురస్కరించుకొని ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభ జరుగుతుందన్నారు. నాయకులు నూపా భాస్కర్, సరోజిని, రమేష్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య సోదరుడి మృతదేహానికి నివాళి



రామయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సాబీర్ పాషా

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య సోదరుడు రామయ్య అనారోగ్యంతో మరణించడంతో బుధవారం అతని మృతదేహానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా నివాళి అర్పించారు. మణుగూరులోని రామానుజవరంలో అయోధ్యను పరామర్శించారు. సీపీఐ నాయకులు పుల్లారెడ్డి, లక్ష్మీకుమారి, లక్ష్మీనారాయణ, మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ★ కాంగ్రెస్ పార్టీ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, పుచ్చకాయల శంకర్, కేవీ రావు, భారాస నాయకులు కుర్రి నాగేశ్వరరావు, వట్టం రాంబాబు, నూకారపు రమేష్‌లు రామయ్య మృతదేహానికి నివాళి అర్పించారు.

గుట్కా పొట్లాల పట్టివేత

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని దుకాణాల్లో విక్రయించేందుకు ములకలపల్లి నుంచి ద్విచక్రవాహనంపై నిషేధిత గుట్కా పొట్లాలు తరలిస్తున్న ఓ వ్యక్తిని తొట్టిపంపు సమీపంలో పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.4100 విలువైన గుట్కా పొట్లాలు స్వాధీనం చేసుకొని, స్టేషన్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఐఎంఏలో అనస్థీషియా వైద్యుల దినోత్సవం



కేకు కోసి వేడుక జరుపుకొంటున్న భద్రాచలం వైద్యులు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ అనస్థీషియా వైద్యుల దినోత్సవాన్ని భద్రాచలం ఐఎంఏ హాలులో పలువురు వైద్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. శస్త్రచికిత్సల సమయంలో మత్తు వైద్యుల సేవలు ఎంతో ఘనమైనవని అన్నారు. వైద్యులు లోకేశ్, మల్లేష్, రమేశ్ చంద్ర, శివరామకృష్ణ, నిఖిత, సురేశ్ కుమార్, అబ్దుల్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి చేయూత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణానికి చెందిన తనూష్ అనే బాలుడికి వసుధ ఫౌండేషన్ హైదరాబాద్ వారు రూ.10 వేల చెక్కును రామాలయం ఈవో రమాదేవి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. తలసీమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడి పరిస్థితిని స్థానికంగా ఉన్న కన్వీనర్ శ్రీనివాసరాజు ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు దృష్టికి తీసుకెళ్లగా వైద్యం కోసం విరాళాన్ని పంపారు.

తాలిపేరు లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏఈ

చర్ల, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరుగుతుండటంతో లోతట్టు గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు ఏఈ ఉపేందర్ బుధవారం ఇక్కడ కోరారు.

చర్ల ఏడీఈగా ప్రభాకర్‌రావు

చర్ల, న్యూస్‌టుడే: చర్ల టీజీ ఎన్పీడీసీఎల్ ఏడీఈగా పి.ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. బుధవారం ఆయన ఇక్కడి ఏడీఈ వేణు నుంచి బాధ్యతలు స్వీకరించారు. వేణు ఐటీడీఏలో ఏపీఓగా విద్యుత్తు విభాగానికి బదిలీపై వెళ్లారు.

అనసూయమ్మకు పలువురి నివాళి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: సీనియర్ న్యాయవాది పూసల కృష్ణమాచారి, శ్రీనివాసచారిల మాతృమూర్తి అనసూయమ్మ సంస్మరణ సభలో పలువురు నివాళులర్పించారు. భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులు భద్రాచలంలో వేర్వేరుగా హాజరై నివాళి అర్పించారు. కోటా దేవనదానం, రమణారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయుల రాకతో కళకళ

అశ్వారావుపేట, దమ్మపేట, న్యూస్‌టుడే



నూతన ఉపాధ్యాయులకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న అశ్వారావుపేట ఎంఈఓ ప్రసాదరావు

అశ్వారావుపేట నియోజకవర్గానికి నూతన ఉపాధ్యాయుల రాకతో విద్యాలయాల్లో నూతన కళ నెలకొంది. నియోజకవర్గంలో మొత్తం 109మంది ఉపాధ్యాయులను కేటాయించగా వారిలో ఎస్జీటీలు (సెకండరీ గ్రేడు టీచర్లు) 85మంది, ఎస్ఏలు (స్కూలు అసిస్టెంట్లు) 23మంది విధుల్లో చేరారు. ఒక ఎస్జీటీ విధుల్లో చేరలేదు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు మంగళవారం నియామక ఉత్తర్వులు అందుకోగా బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయాల్లో రిపోర్టు చేసి తమకు కేటాయించిన గ్రామాల్లోని పాఠశాలల్లో విధుల్లో చేరారు. వారికి ధ్రువీకరణ పత్రాలను ఆయా మండలాల ఎంఈఓలు అందజేశారు. అశ్వారావుపేట మండలానికి 49మంది సెకండరీ గ్రేడు టీచర్లు, పది మంది స్కూల్ అసిస్టెంట్లను మండలానికి కేటాయించగా అందరూ విధుల్లో చేరారు. చంద్రుగొండ మండలానికి నలుగురు ఎస్జీటీలను, అన్నపురెడ్డిపల్లి మండలానికి ఒక ఎస్జీటీని కేటాయించగా అందరూ విధుల్లో చేరారు. ములకలపల్లి మండలానికి నలుగురు ఎస్జీటీలను, ఐదుగురు ఎస్ఏలను కేటాయించగా వారిలో ఒక ఎస్జీటీ విధుల్లో చేరలేదు. దమ్మపేట మండలంలో ఎస్జీటీలు 28మంది, స్కూల్ అసిస్టెంట్లు నలుగురు, స్పెషల్ ఎడ్యుకేషన్ నుంచి ఒకరు విధుల్లోకి చేరారు. బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయాలన్నీ నూతన ఉపాధ్యాయులతో సందడిగా మారాయి. నూతనంగా విధుల్లో చేరిన వారికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

అశ్వాపురం, కరకగూడెం, న్యూస్‌టుడే: డీఎస్సీ ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులు బుధవారం అశ్వాపురం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఎంఈఓ జి.వీరాస్వామి మండల విద్యా వనరుల కేంద్రంలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. పద్దెనిమిది మంది ఎస్‌జీటీ, నలుగురు ఎస్ఏలు మండలంలో కొత్తగా చేరిన వారిలో ఉన్నారు. పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు వారికి అభినందనలు తెలిపారు. కరకగూడెం మండలంలో ఎస్జీటీలు 21 మందికి 17 మంది, స్కూల్ అసిస్టెంట్లు ముగ్గురు విధుల్లో చేరినట్లు ఎంఈఓ తెలిపారు.

మణుగూరు సాంస్కృతికం: మణుగూరులోని ఎమ్మార్సీ కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయ విధుల్లో చేరిన వారిని టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మీరాహుస్సేన్ అభినందించారు.



అశ్వాపురంలో నూతన ఉపాధ్యాయురాలికి పత్రాన్ని అందజేస్తున్న ఎంఈఓ వీరాస్వామి

చర్ల, దుమ్ముగూడెం: డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. చర్ల మండలానికి కేటాయించిన 53 మందిలో 52 మంది, దుమ్ముగూడెం మండలంలో 20మందికి అందరు ఉపాధ్యాయులు విధుల్లో చేరారని మండల విద్యాశాఖాధికారులు తెలిపారు.

భయం గుప్పిట్లో చదువులు



శిథిలావస్థకు చేరిన పాఠశాల

బూర్గంపాడు, న్యూస్‌టుడే

బూర్గంపాడు మండలం చెరువుసింగారం ప్రాథమిక పాఠశాలలో చదువులు భయం భయం మధ్య కొనసాగుతున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయపడుతున్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా ఐదో తరగతి వరకు చదువుతున్న 32 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల బిల్డింగ్ గోడలు బీటలు వారాయి. శ్లాబు సైతం బీటలు వారి పెచ్చులూడుతోంది. వర్షం కురిస్తే నీళ్లు లోపలకు వస్తున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. తరగతి గదులు సరిగా లేకపోవడంతో ఉపాధ్యాయులు ఆరుబయట చెట్ల కిందనే అధిక శాతం పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల పరిస్థితిపై ప్రధానోపాధ్యాయుడు గణేశ్‌బాబు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ... ఇక్కడి సమస్యను ఉన్నతాధికారులకు వివరించామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

కొత్తగూడెం

•కొత్తగూడెం •ఇల్లెందు

ముగిసిన కంపెనీ స్థాయి క్రీడాపోటీలు



క్రీడాకారులతో జీఎం జాన్ ఆనంద్, అధికారులు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో స్థానిక మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన కంపెనీ స్థాయి బాస్కెట్‌బాల్, లాన్‌టెన్నిస్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. సింగరేణికి చెందిన ఆరు రీజియన్ల క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను జీఎం జాన్ ఆనంద్, అధికారులు అభినందించారు. అధికారులు వెంకటేశ్వర్లు, శివ ప్రసాద్, మోహన్‌రావు, కార్మిక సంఘం నాయకులు నజీర్ అహ్మద్, జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం: కొత్వాల

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సే లక్ష్యమని పాల్వంచ పీఏసీఎస్ అధ్యక్షుడు, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సొసైటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. రైతులకు రాయితీపై విత్తనాలు, ఎమ్మార్పీపై ఎరువులు అందజేస్తున్నట్లు కొత్వాల తెలిపారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేశ్, సీఈవో లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

డీజే బాక్సులు వినియోగిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో డీజే బాక్సులు ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అధిక శబ్దం వచ్చే పరికరాల వినియోగంపై పోలీస్ చట్టం నిబంధనల ప్రకారం తాజాగా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు సాయంత్రం 6 గంటల వరకు నిబంధన అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

స్నేహం పేరుతో చెడు అలవాట్ల జోలికెళ్లొద్దు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: చదువుకునే వయసులో విద్యార్థుల సరదాల కోసం వెంపర్లాడితే భవిష్యత్ అంధకారం అవుతుందని త్రీటౌన్ ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ హెచ్చరించారు. మత్తు అనర్థాలపై మేదరబస్తీలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ కొందరు విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి చదువుకు దూరమవుతున్నారని అన్నారు. దీంతో తల్లిదండ్రులు ఎంతో క్షోభకు గురవుతున్నారన్నారు. ఎదిగే వయసులో ఆరోగ్యాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారన్నారు. స్నేహం పేరుతో చెడు అలవాట్ల జోలికెళ్లొద్దన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు తెలపాలని.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. స్థానిక సాధన జూనియర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం, అవి కలిగి ఉండటం నేరమని, ఎవరి దగ్గరైనా డ్రగ్స్ ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుత్తు కార్యాలయాల్ని చూస్తే షాకే!

శిథిలావస్థలో 'గూడెం' సౌత్ సెక్షన్ భవన సముదాయం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

అసలే వర్షాకాలం. అందునా పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనం. ఎప్పుడు కుప్పకూలుతుందో తెలియదు. ఎవరి ప్రాణాలను బలితీసుకుంటుందో ఏమో? అన్న చందంగా కొత్తగూడెంలోని సౌత్ సెక్షన్ ఏడీఈ, ఏఈ కార్యాలయాల భవనం తయారైంది. బాబుక్యాంప్ బస్తీలో ఒకే దగ్గర ఏర్పాటు చేసిన విద్యుత్ ఏడీఈ, ఏఈ కార్యాలయాల భవనం బాగా పాతబడింది. ఇక్కడి సిబ్బంది ఇటీవల వర్షాలకు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించారు.



పై పెచ్చులూడిన గది | శిథిల క్వార్టర్‌లో కార్యాలయాలు

చుంచుపల్లి, విద్యానగర్, బాబుక్యాంప్, బర్మాక్యాంప్, రాంనగర్, గాంధీ కాలనీ, పెనగడప, పెనుబల్లి, పాత కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలంలో కొంత భాగం, శ్రీనగర్, రామవరం, బస్టాండ్ ఏరియా తదితర ప్రాంతాల ప్రజలకు ఏడీఈ, ఏఈ పరిధిలో సేవలు అందిస్తున్నారు. ఖమ్మం ప్రధాన రహదారి పక్కన, రామాలయం ఎదురుగానున్న ఖాళీ క్వార్టర్‌ను పంచాయతీ రాజ్ శాఖ (అంతకు ముందు సింగరేణి వారిది) 20 ఏళ్ల క్రితం విద్యుత్తు కార్యాలయం కోసం అప్పగించింది. ఇది కొంత స్లాబ్, మరికొంత రేకుల షెడ్డుతో ఉంది. స్లాబ్ పైపెచ్చులు తరచూ ఊడిపడుతున్నాయి. రేకులు పగిలిపోయాయి. చుట్టూ గోడలు నానిపోయి ఎప్పుడు కుప్పకూలతాయో? అన్నట్లుగా తయారయ్యాయి.

తాకిడి ఎక్కువ..

ఏడీఈ కార్యాలయం, ఏఈ కార్యాలయం పక్కపక్కనే ఉండటంతో వినియోగదారుల తాకిడి కూడా ఎక్కువే. రెండు కార్యాలయాల్లో కలిపి ఇద్దరు అధికారులు, 25 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. సమీప ప్రాంత వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు కేంద్రానికి పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. కనీసం విధులు నిర్వహించేందుకు అనుకూలంగానైనా కనీస మరమ్మతులు చేయించాలని అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. కింద ఫ్లోరింగ్ ధ్వంసమైంది. చిన్నపాటి వర్షం వచ్చినా దస్త్రాలు, కంప్యూటర్లకు రక్షణ కరవైంది. ప్రస్తుతం పెరిగిన వినియోగదారుల అవసరాలకు తీర్చేలా సౌత్ సెక్షన్‌కు ఏడీఈ కార్యాలయ నూతన భవనాన్ని నిర్మించాలని జిల్లా కలెక్టర్‌ను ఉద్యోగులు వేడుకుంటున్నారు. అప్పటి వరకు ప్రత్యామ్నాయంగానైనా మరోచోట తగిన వసతులతో భవనం కేటాయించాలని, సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపాలని కోరాం..

ఏడీఈ, ఏఈఈ కార్యాలయాల నిర్వహణకు ప్రత్యామ్నాయంగా సమీపంలో ఓ సింగరేణి క్వార్టర్‌ను ఇవ్వాలని ఆర్నెల్ల క్రితం సింగరేణి డైరెక్టర్ 'పా'ని కలిసి వినతిపత్రం అందించాం. చుంచుపల్లి పోలీస్‌స్టేషన్‌ను కొత్త భవనంలో మార్చారు. ఖాళీ చేసిన కార్యాలయాన్ని ఇవ్వాలని కోరితే అది వేరే వారికి కేటాయించారని చెప్పారు. సౌత్, నార్త్ సెక్షన్ల కార్యాలయాలు భజనమందిర్ సబ్‌స్టేషన్ సమీపంలోకి శాశ్వతంగా మారే అవకాశం కూడా ఉంది. ప్రభుత్వ స్థలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో నూతన భవన నిర్మాణంలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. – పి.హేమచంద్రబాబు, ఏడీఈ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: శ్రీనగర్ పంచాయతీ 2వ లైన్‌లో రహదారి పక్కన మురుగు కాల్వ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టి వదిలేశారు. నెలలు గడుస్తున్నాయి. అక్కడ మురుగు చేరి దుర్వాసన వస్తోంది. - పాఠకుడు

సమాధానం: కాల్వ నిర్మాణ సమస్యను ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధుల మంజూరు ప్రతిపాదనలు పెట్టాం. త్వరలో పనులు పూర్తిచేస్తాం. - వెంకట్, పంచాయతీ కార్యదర్శి

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే



లక్ష్మీదేవి పల్లి(ఎస్)లో కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. రోజుల తరబడి కాల్వల పూడిక తీయక దుర్గంధం వెదజల్లుతోంది. - ఓ పాఠకుడు

✔ పంచాయతీ సిబ్బందితో మాట్లాడి తక్షణం పూడిక తీయిస్తాం. - ఎంపీవో నారాయణ

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

దంతెలబోరలో పలుచోట్ల త్రీఫేజ్ విద్యుత్తు తీగలు కిందకు జారి ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని సరిచేయించాలి. - పెద్దిరాజు

✔ కొన్ని ప్రదేశాల్లో మరమ్మతులు చేశాం. మీరు చెప్పిన ప్రాంతంలో వెంటనే సమస్య పరిష్కరిస్తాం. - రవికుమార్, లైన్‌మెన్

పాల్వంచ పట్టణం

స్థానిక ఐటీఐ మలుపు వద్ద రాత్రి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ వీధిదీపాలు లేవు. వెంటనే ఏర్పాటు చేయాలి. - కే.రాములు, గౌతంపూర్

✔ వీధిలైటు ఏర్పాటు చేయాల్సిందిగా ఈఅండ్ఎం సిబ్బందిని ఆదేశిస్తాను. - జీఎం షాలేమురాజు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

రాజీవ్ పార్కు, ప్రగతి మైదానంలో మొక్కలు ఏపుగా పెరిగి విష పురుగులు, సర్పాల బెడద నెలకొంది. మైదానంలో నెలకొన్న అసౌకర్యాలను తీర్చాలి. - నడకసాధకులు

✔ పారిశుద్ధ్య కార్మికులతో మైదానాల్లో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి పిచ్చిమొక్కలు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. నడక సాధకులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - అశోక్‌చౌహాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

రహదారికి కొత్త కళ



పాల్వంచ ప్రధాన కూడలి నుంచి కేటీపీఎస్ కర్మాగారం వైపు వెళ్లే దారిలో డివైడర్, విద్యుద్దీపాల ఏర్పాటుతో కొత్త కళ సంతరించుకుంది. గతంలో ఏక వరుస దారిగా ఉన్న ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అడ్డదిడ్డంగా జరిగేవి. - ఈనాడు, ఖమ్మం పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

కడియం మొక్కలకు భలే గిరాకీ



కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లోని సింగరేణి, కేటీపీఎస్, నవభారత్ తదితర కాలనీలకు చెందిన ఉద్యోగులు మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరుస్తుంటారు. ఈ నేపథ్యంలో ఏటా వర్షాకాలం సీజన్‌లో రాజమహేంద్రవరం, కడియం ప్రాంతాల నుంచి వచ్చే అరుదైన మొక్కలకు మంచి డిమాండ్ ఉంటోంది. దీంతో కొబ్బరి, మామిడి, పనస, నారింజ పండ్ల మొక్కలు, గులాబీ, మందారం, పారిజాత, నూరు వరహాలతో పాటు క్రోటాన్, ఇతర ఔషధ మొక్కలను ద్విచక్రవాహనాలపై వ్యాపారులు విక్రయిస్తున్నారు. – కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

'వాయిదాలకు పింఛను రికవరీ అన్యాయం'

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత రుణ వాయిదాలకు ఆసరా పింఛను నగదును రికవరీ చేయడం అన్యాయమని సీపీఐ ప్రతినిధి బృందం గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ హేమంత్ కుమార్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసింది. కొందరు పేదలైన ఖాతాదారులు లోన్లు తీసుకున్నారని, వారి వద్ద గడువు హామీ పత్రం తీసుకొని పింఛన్లు రిలీజ్ చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, సక్రాం, లచ్చిరాం పాల్గొన్నారు.

కాలువలకు కొత్తరూపు



జయమ్మకాలనీలో..

శ్రీనగర్‌కాలనీ వాసులు, జయమ్మకాలనీ వాసులు తమ ప్రాంత మురుగు కాలువల సమస్యలను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక ద్వారా స్థానిక పారిశుద్ధ్య సమస్యలను ఇటీవల విన్నవించారు. వెంటనే పురపాలక అధికారులు స్పందించి డ్రైనేజీలను బుధవారం శుభ్రం చేయించారు. – పాల్వంచ, న్యూస్‌టుడే

జేకే-5 ఓసీలో చండీయాగం ప్రారంభం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణి కాలరీస్ అభివృద్ధిని కాంక్షిస్తూ ఏరియాలోని జేకే-5 ఓసీలో నిర్వహించ తలపెట్టిన చండీయాగాన్ని జీఎం జాన్ ఆనంద్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. తొలుత గణపతి పూజ, అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, హోమం జరిపించారు. పూజా కార్యక్రమాల్లో అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, రామస్వామి, పూర్ణచందర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగి మాన్వితకు రజతం



కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ఉత్తరాఖండ్ రాష్ట్రంలో డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఆలిండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్ మీట్‌లో బుధవారం జరిగిన పోటీల్లో షాటపుట్ విభాగంలో సింగరేణి ఉద్యోగిని కె.మాన్విత రజత పతకాన్ని సాధించారు. కార్పొరేట్ ఎస్టేట్ విభాగం ఉద్యోగిని అయిన మాన్విత సింగరేణి, కోలిండియా స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. మాన్వితను అధికారులు, కోచ్ మల్లికార్జున్ అభినందించారు.

కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణకు డిమాండ్

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి అన్నారు. ఈ నెల 20న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇల్లెందులో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు.

గుట్టపై తవ్వకాల అడ్డగింత.. వాహనాల స్వాధీనం

టేకులపల్లి, న్యూస్‌టుడే: కుంటల్ల పంచాయతీ అందుగులగూడెం సమీప గుట్టపై అనుమతుల్లేకుండా చేపట్టిన మట్టి తవ్వకాలను గిర్దావర్ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది బుధవారం అడ్డుకున్నట్లు ఎస్సై పి.సురేశ్ తెలిపారు. నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని ఠాణాకు తరలించారని చెప్పారు.

'టేకులపల్లి'కి ఐదుగురు ఉపాధ్యాయుల కేటాయింపు

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల డీఎస్సీలో భాగంగా మండలంలో కొత్తగా ఐదుగురు ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరినట్లు ఎంఈఓ జగన్ తెలిపారు. కిష్టారం యూపీఎస్‌కు ఎస్‌జీటీ, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎస్ఏ సోషల్, ఆంగ్లం, కోయగూడెం యూపీఎస్‌కు ఎస్ఏ సోషల్, ముత్యాలంపాడు జడ్పీహెచ్‌ఎస్‌కు ఎస్ఏ సోషల్ ఉపాధ్యాయుడు నియమితులైనట్లు ఆయన బుధవారం చెప్పారు.

దసరా ముగింపు వేడుకల్లో.. సహపంక్తి భోజనాలు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: దసరా ముగింపు వేడుకల్లో భాగంగా కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో సహపంక్తి భోజనాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏరియా జీఎం షాలేమురాజు, ఎస్వోటూజీఎం కోటిరెడ్డి, అధికారులు నర్సింహారావు, రఘురామిరెడ్డి, రాంకుమార్, తిరుమలరావు, రామకృష్ణ, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు మల్లికార్జున్‌రావు, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనల ప్రకారమే మత్స్య సొసైటీ నిర్వహణ'

టేకులపల్లి, న్యూస్‌టుడే: బేతంపూడి మత్స్య సొసైటీ నిబంధనల ప్రకారమే కొనసాగుతుందని ఛైర్మన్ చీమల రామయ్య బుధవారమిక్కడ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. కొందరు సొసైటీపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు.

పీడీఎస్‌యూ మహాసభల విజయవంతానికి పిలుపు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఖమ్మంలో ఈ నెల 21న, హైదరాబాద్ ఓయూలో ఈ నెల 24వ తేదీన నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దపు మహాసభలను విజయవంతం చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు జడ సీతారామయ్య, కొక్కు సారంగపాణి కోరారు. ఇర్ప రాజేష్ ఆధ్వర్యంలో పట్టణంలో గోడప్రతులను బుధవారం ఆవిష్కరించారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

ఇల్లెందు గ్రామీణం: మండలంలోని మర్రిగూడెంకు చెందిన మూతి నరేందర్(29) మరో ఇద్దరు మిత్రులతో కలిసి ద్విచక్రవాహనంపై ఈ నెల 14న ద్విచక్రవాహనంపై ఇల్లెందు బైపాస్‌లో వెళ్తూ అదుపుతప్పి పడ్డాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. బుధవారం ఎస్.ఐ. సూర్య కేసు నమోదు చేశారు.

నల్లబెల్లం పట్టివేత..: టేకులపల్లి: మండల కేంద్రంలో ఓ కిరాణా దుకాణ యజమాని ఇంట్లో 144 కిలోల నల్ల బెల్లాన్ని కొత్తగూడెం స్పెషల్ స్క్వాడ్ బుధవారం స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్ తెలిపారు.

గుడిసె వాసులకు తొలి ప్రాధాన్యమివ్వండి



ఎమ్మెల్యే కోరం, మున్సిపల్ ఛైర్మన్ డీవీకి సమస్యలు చెబుతున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: రాజీవ్‌నగర్‌లోని గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సీపీఎం నాయకులు విన్నవించారు. పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న కోతుల, వీధికుక్కల బెడదను, తాగునీటి ఇక్కట్లను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం అక్కడకు వచ్చిన ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీవో చిరంజీవికి వినతిపత్రాలు అందజేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, జిల్లా నాయకులు అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, సంధ్య, లక్ష్మీ, సుల్తానా, రాము, మాధవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం: గుమ్మడి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

జూలూరుపాడు, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని నమ్మి పార్టీ తరఫున ప్రజల కోసం ఉద్యమించిన వారిలో తాటి లక్ష్మి ఒకరని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, మాస్‌లైన్(ప్రజాపంథా) రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య అన్నారు. జూలూరుపాడు మండలం గుండ్లరేవులో బుధవారం నిర్వహించిన ఆమె సంతాప సభలో ఆయన మాట్లాడారు. 1991 నుంచి చనిపోయే వరకు ప్రజాపంథా సభ్యురాలిగా కొనసాగుతూ ఈ ప్రాంత పేదల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాల్లో లక్ష్మి పాల్గొన్నారని, ఆమె ఆశయాల సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేసినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లని పేర్కొన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, ఎదులాపురం గోపాలరావు, కృష్ణయ్య సిద్ధు, రోహిణి, ధర్మా, నరసింహారావు పాల్గొన్నారు.

చెరకు సాగుతో రైతులకు ఆదాయం



చెరకు పంటను పరిశీలిస్తున్న కల్లూరు చక్కర ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతినిధులు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: చెరకు సాగుతో రైతులు ఆదాయం గడించే అవకాశం ఉందని కల్లూరు చక్కర ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతినిధి రఘునాథబాబు పేర్కొన్నారు. జూలూరుపాడులో బుధవారం చెరకు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగానే రైతులకు ఎకరానికి రెండు టన్నుల విత్తనం ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. టన్నుకు మద్దతు ధర రూ. 3,200 ఇవ్వనున్నారని, కూలీల కొరత కారణంగా చెరకు కటింగ్‌కు యంత్రాలను వినియోగించి ఫ్యాక్టరీకి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఎకరానికి 50 నుంచి 60 టన్నుల వరకు దిగుబడి రానుండగా, ఆదాయం రూ.లక్ష వరకు గడించే అవకాశం ఉందన్నారు. అనువైన నేలను ఎంపిక చేసుకుని చెరకు సాగుచేసి లాభాలు పొందాలన్నారు. అంతకు ముందు జూలూరుపాడులోని చెరకు తోటలను బృందం పరిశీలించింది. ఈ సమావేశంలో షుగర్ ఫ్యాక్టరీ సీనియర్ కేన్ మేనేజర్ శాఖమూరి హరిబాబు, ఏఓ ప్రభాకర్‌రావు, క్షేత్రసహాయకులు హరిబాబు, రాజేశ్‌లు పాల్గొన్నారు.

నిర్వాసితులుగా గుర్తించాలని ఆందోళన



ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తిలక్‌నగర్ పంచాయతీ కుమ్మరిబస్తీలో సింగరేణి ఉపరితల గనిలో చేపట్టిన పనులను స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. ఓసీకి వంద మీటర్లలోపే ఉన్న తమ బస్తీని నిర్వాసిత ప్రాంతంగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. మట్టి చదును చేస్తున్న డోజర్‌కు అడ్డుగా నిలిచారు. కార్యక్రమంలో రాజు, సారంగపాణి, శ్రీను, హరీష్, అవినాష్, మహేష్ పాల్గొన్నారు.

'విలీన ప్రకటనతో సంబంధం లేదు'

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సంస్థ రాజకీయ విధానాలను విభేదిస్తూ బయటకు వెళ్లిన ఓ వర్గం వారు ఐఎఫ్‌టీయూ పేరుతోనే సంస్థను ఏర్పాటు చేసుకొని.. టీయూసీఐలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సీతారామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి అన్నారు. ఈ ప్రకటనతో తమ మాతృసంస్థకు సంబంధం లేదని ఇల్లెందులోని సంఘం కార్యాలయంలో బుధవారం వెల్లడించారు.


ప్రతి కార్మికుడికి బోనస్ ఇవ్వాల్సిందే



కేటీసీలో ఓబీ క్యాంపు వద్ద మాట్లాడుతున్న రాజకీయ ఐకాస కన్వీనర్ లక్కినేని సురేందర్‌రావు

టేకులపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి ప్రకటించిన లాభాల్లో బోనస్‌ను ఓబీలో పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి వర్తింపజేయాలని రాజకీయ ఐకాస కన్వీనర్ లక్కినేని సురేందర్‌రావు డిమాండ్ చేశారు. కోయగూడెం ఓసీలో ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన బుధవారం మాట్లాడారు. స్థానిక ఎల్ఎస్ఎన్ యాజమాన్యం కింద ఓబీలో పనిచేసే కార్మికుల్లో 350కి గాను 160 మంది కాంట్రాక్టు వారేనన్నారు. వీరితో పాటు కొందరు రెగ్యులర్ మస్టర్లు ఉన్నవారికీ బోనస్ ఇవ్వలేదని సురేందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు దళ్‌సింగ్, హర్జ్యా, వీరబ్రహ్మాచారి, గౌని నాగేశ్వరరావు, యాకుబ్‌షావళి, రాంసింగ్, వెంకన్న పాల్గొన్నారు.

ఈ భవనానికి.. 116 ఏళ్ల చరిత్ర!



దశాబ్దాలుగా చెక్కుచెదరని మిషన్ స్కూల్ భవనం



ఎనిమిది దశాబ్దాలుగా విద్యార్థుల్ని తీర్చిదిద్దిన తరగతి గది

బ్రిటీష్ హయాంలో 1908లో ఇల్లెందు పట్టణంలో నిర్మించిన భవనం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఇక్కడ 1942 నుంచి, అంటే గత ఎనిమిది దశాబ్దాలకు పైగా మిషన్ స్కూల్ (ప్రాథమిక) పాఠశాల నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ఎయిడెడ్ స్కూల్‌లో 20 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. చల్లగా, ఆహ్లాదంగా ఉండే ఈ భవనం బ్రిటీషు కాలం నాటి నిర్మాణ నైపుణ్యానికి, పటిష్ఠతకు ఆలవాలమై నిలుస్తోంది. ఒకప్పుడు విద్యా సంబంధ కార్యక్రమాలన్నీ ఇక్కడే నిర్వహించే వారని.. తానూ ఇక్కడి విద్యార్థినేనని ఎంఈవో టీవీ ఆర్ఎన్ స్వామి 'న్యూస్‌టుడే'తో జ్ఞాపకాలను పంచుకున్నారు. – ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

బరువులు విసరడంలో బలశాలులు!

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

ఓ వైపు చదువులో రాణిస్తూనే.. ఇంకోవైపు ఆటల్లో ప్రావీణ్యాన్ని సంపాదిస్తున్నారు కొందరు విద్యార్థులు. తాజాగా జాతీయ, వర్సిటీ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారే.. కొత్తగూడెంకు చెందిన జరుపుల దీక్షిత్. . రియాజ్ పాషా. ఈ నెల 17 (గురువారం) నుంచి గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే 35వ సౌత్‌జోన్ నేషనల్స్‌కు హాజరవుతుండగా, రియాజ్‌పాషా ఈ నెల 27 నుంచి ఖమ్మంలో జరిగే కాకతీయ విశ్వవిద్యాలయ స్థాయి పోటీకి సన్నద్ధమవుతున్నారు. వీరిద్దరూ ప్రకాశం మైదానంలో కోచ్ మల్లికార్జున్ పర్యవేక్షణలో సాధన సాగిస్తున్నారు.

జాతీయ పోటీలకు మూడోసారి..



కోచ్ మల్లికార్జున్‌తో దీక్షిత్

పాలిటెక్నిక్ చదువుతున్న దీక్షిత్ గతేడాది అక్టోబరులో హనుమకొండలో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో అండర్-14లో షాట్‌పుట్‌ను 15.17 మీటర్ల దూరం విసిరారు. అప్పటిదాకా ఉన్న రికార్డును అధిగమించారు. ట్రయథ్లాన్‌లోనూ ద్వితీయస్థానాన్ని పొందారు. గతేడాది నవంబరులో కోయంబత్తూరులో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో షాట్‌పుట్‌లో ప్రతిభచాటారు. తాజాగా మూడోసారి జాతీయ స్థాయి పోటీల్లో అదృష్టం పరీక్షించుకుంటున్నారు.

హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రోలో దిట్ట.. రియాజ్



హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ విసరడంలో ఎంతో నైపుణ్యం గల రియాజ్ పాషా ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. 2019 నవంబరులో హనుమకొండలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో హ్యామర్‌ను 23 మీటర్ల దూరం విసిరి కాంస్యం, 2021 జనవరిలో సూర్యాపేటలో డిస్కస్‌త్రోను 39.50 దూరం విసిరి స్వర్ణం చేజిక్కించుకున్నారు. 2021 ఫిబ్రవరిలో హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన మరో జాతీయ టోర్నీ విజ్డమ్ లీగ్‌లో షాట్‌పుట్‌లో రజతం గెలిచారు. త్వరలో జరగనున్న వర్సిటీ అంతర్ కళాశాలలకు ప్రాతినిధ్యం వహించనున్నారు.